క్లుప్తంగా

టీబీ వ్యాధిపై అవగాహన



అవగాహన కల్పిస్తున్న డాక్టర్ పృథ్వీరాజ్

ఆదోని టౌన్: పట్టణంలోని ఇందిరానగర్, శంకర్‌నగర్, హవన్నపేట అర్బన్ హెల్త్ సెంటర్లలో డాక్టర్‌లు షేకున్‌బాను, పథ్వీరాజ్‌ల ఆధ్వర్యంలో క్షయవ్యాధి నిర్మూలనపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. వారు మాట్లాడుతూ క్షయవ్యాధి నిర్ధారణ కోసం ప్రభుత్వం వంద రోజుల స్పెషల్ డ్రైవ్‌ను నిర్వహిస్తుందన్నారు. ఇందులో భాగంగా షుగర్ వ్యాధిగ్రస్తులకు, 60 సంవత్సరాలు పైబడిన వారికి, ధూమపానం, మధుపానం అలవాటు ఉన్న వారికి ప్రత్యేకంగా గళ్ల పరీక్షలు, ఎక్స్‌రేలు నిర్వహిస్తారన్నారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్‌లు బాబురాజు, ఇందిరా దోరతి, మేరీ అరుణ, జ్ఞానేశ్వరి, భాస్కర్, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

టీజీఎల్ కాలనీలో సీసీ రోడ్లు ఏర్పాటు



సీసీ రోడ్డును పరిశీలిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకుడు వాల్మీకి కొండారెడ్డి కిషోర్

ఆదోని టౌన్: ఆదోని మున్సిపాలిటీ 33వ వార్డు పరిధిలోని టీజీఎల్ కాలనీలో దాదాపు రూ.16 లక్షలు జనరల్ ఫండ్ ద్వారా రోడ్లు, డ్రైనేజీలు, కల్వర్టులు వేస్తున్నట్లు కౌన్సిలర్ వాల్మీకి కొండా రెడ్డి కీర్తన, వైఎస్సార్‌సీపీ నాయకుడు వాల్మీకి కొండారెడ్డి కిషోర్ తెలిపారు. మంగళవారం కాలనీలో వేసిన సీసీ రోడ్లు, కల్వర్టులు, డ్రైనేజీలను వాల్మీకి కొండారెడ్డి పరిశీలించారు. కొండారెడ్డి కిషోర్ మాట్లాడుతూ 33వ వార్డు పరిధిలో ఏ సమస్య వచ్చినా పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. సమస్య ఉంటే నేరుగా తనదృష్టికి తీసుకురావాలన్నారు.

క్రికెట్ పోటీలు ప్రారంభం



మంత్రాలయంలో క్రికెట్ ఆడుతున్న సర్పంచ్ తెల్లబండ్ల భీమయ్య

మంత్రాలయం రూరల్ : క్రీడాకారులు గెలుపు ఓటములను సమానంగా తీసుకోవాలని గ్రామ సర్పంచ్ తెల్లబండ్ల భీమయ్య అన్నారు. దీపావళి పండుగ సందర్భంగా మంగళవారం మండల కేంద్రం మంత్రాలయంలోని హెలిప్యాడ్ మైదానంలో ఎమ్మెల్యే వై బాలనాగిరెడ్డి ఆదేశాల మేరకు భీమా యూత్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న క్రికెట్ పోటీలను సర్పంచ్ ప్రారంభించారు. మొదటి బహుమతి రూ.30 వేలు, రన్నర్‌కు రూ.20 వేలుతో పాటు ట్రోఫిని అందిస్తామని తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు శివ, రాము, బొజ్జప్ప, మారెప్ప, ఆర్గనైజర్లు బాలు, ఈశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

పౌష్టికాహారంతో సంపూర్ణ ఆరోగ్యం



మంత్రాలయంలో చిన్నారికి అన్నప్రాసన చేస్తున్న సీడీపీఓ రాజేశ్వరి దేవి

మంత్రాలయం రూరల్ : గర్భిణులు, బాలింతలు, కిశోర బాలికలు, చిన్నారులకు పౌష్టికాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని సీడీపీఓ రాజేశ్వరి దేవి అన్నారు. మంగళవారం మండల కేంద్రం మంత్రాయలంలోని సీడీపీఓ కార్యాలయంలో స్త్రీ, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో పౌష్టికాహారం మాసోత్సవాలు నిర్వహించారు. చిన్నారులకు అన్న ప్రాసన, గర్భిణులకు సీమంతాలు చేపట్టారు. ఆమె మాట్లాడుతూ.. రక్త హీనత నివారణకు ఆకు కురలు, కూరగాయాలులతో పాటు పౌష్టికాహారం తీసుకోవాలని వివరించారు. ర్యక్రమంలో అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు సుమిత్రమ్మ, వీరగోందమ్మ, అఖిల, భాగ్యలక్ష్మీ, కాత్యాయిని, విజయకుమారి పాల్గొన్నారు.

పురపాలక పాఠశాలలకు తీరని అన్యాయం

ఆదోని సెంట్రల్: మెగా డీఎస్సీ ద్వారా ఉపాధ్యాయుల కేటాయింపులో పురపాలక పాఠశాలలకు తీరని అన్యాయం జరిగిందని ఆంధ్రప్రదేశ్ మున్సిపల్ టీచర్స్ ఫెడరేషన్ ఆదోని కార్యవర్గ సభ్యులు అనిల్ కుమార్, జంగం బసవరాజు, ఎల్లాగి, నాగేశ్వర నాయుడు అన్నారు. మంగళవారం నెహ్రూమెమోరియల్ పాఠశాలలో జాయిన్ కావడానికి వచ్చిన ఉపాధ్యాయులకు సర్వీస్ రూల్స్, రిజిస్టర్, ఫార్స్ వంటి వాటిపై అవగాహన కల్పించారు. వారు మాట్లాడుతూ పట్టణంలో పురపాలక పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య అధికంగా ఉండడంతో చాలా వరకు ఉన్నత పాఠశాలలుగా మార్చారన్నారు. ఆ పాఠశాలల్లో సబ్జెక్టుకు ఒక ఉపాధ్యాయున్ని కూడా నియమించక పోతే విద్యాబోధన ఎలా కొనసాగుతుందన్నారు. ఎంటీఎఫ్ నాయకులు భాస్కర్ అచారి, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

మద్యం మత్తులో గ్రామాలు చిత్తు

- పచ్చని పల్లెల్లో ఏరులై పారుతున్న మద్యం
- టీడీపీ పెద్దల అండ దండలతో బెల్టు షాపుల జోరు
- అధిక ధరలకు విక్రయాలు
- చోద్యం చూస్తున్న అధికారులు



కనకవీడు గ్రామంలో టీడీపీ నాయకుడు ఏర్పాటు చేసుకున్న బెల్టు షాపు



ముగతిలోని మద్యం షాపు

నందవరం : బెల్టుషాపులకు విరుద్ధమంటూ వేదాలు వల్లించిన ముఖ్యమంత్రి చంద్రబాబు పాలనలో ఆ పార్టీ నాయకులే బెల్ట్‌షాపులను ఊరూరా తెరిచారు. పచ్చని పల్లెలకు బెల్టు కంపు పాకి చిచ్చు పెడుతోంది. గ్రామాల్లో వీధి వీధినా.. వాడ వాడలా మద్యం ఏరులై పారుతోంది. దీంతో మందు బాబులు నిత్యం మత్తులో తూగుతూ జేబులు ఖాళీ చేసుకుంటున్నారు. ఎమ్మార్పీకి మించి అధిక ధరలకు మద్యం విక్రయిస్తూ నిర్వాహకులు సొమ్ము చేసుకుంటున్నారు. బెల్టు షాపుల దందా జోరుగా సాగుతున్నా ఎక్సైజ్, పోలీసు అధికారులు నామమాత్రపు దాడులతో సరిపెడుతున్నారు.

ప్రతి పల్లెలో బెల్టు షాపు

ఎమ్మిగనూరు నియోజకవర్గంలో మొత్తం 16 మద్యం దుకాణాల ఏర్పాటుకు ప్రభుత్వం అనుమతిచ్చింది. ఇవి కాకుండా పల్లెల్లో గ్రామాల వారీగా రెండు నుంచి మూడు చొప్పున బెల్టు షాపులు ఉన్నట్లు తెలుస్తోంది. నియోజకవర్గంలోని నందవరం, ఎమ్మిగనూరు, గోనెగండ్ల మండలాల్లో ప్రతి మద్యం షాపు పరిధిలో మూడు నుంచి నాలుగు బెల్టు షాపులు కొనసాగుతున్నాయని సర్వత్రా చర్చ జరుగుతోంది. నియోజకవర్గంలో 160పైగా, నందవరం మండలంలో దాదాపు 50 నుంచి 70 బెల్టు షాపులు ఉన్నాయి. నందవరం మండలంలో అత్యధికంగా కనకవీడు, హాలహర్వి, నందవరం, సోమలగూడూరు గ్రామాల్లో బెల్టు జోరుగా సాగుతోంది. మద్యం షాపుల ద్వారా మద్యం గ్రామాలకు సరఫరా చేస్తుదడంతో పల్లెల్లో అమ్మకాలు జోరుగా సాగుతున్నాయి.

రూ.20 నుంచి రూ.50 వరకు అదనంగా వసూలు

అధిక ధరలకు విక్రయిస్తున్నా సంబంధిత ఎక్సైజ్ శాఖ పట్టించుకోలేదంటూ ఆరోపణలు వినిపిస్తున్నాయి. మద్యం బాటిల్‌పై అదనంగా వసూలూ చేస్తున్నట్లు మందు బాబులు ఆరోపిస్తున్నారు. ఒక్కో బాటిల్‌కి రూ.20 నుంచి రూ.30, బీర్ బాటిళ్లకు రూ.50 అదనంగా వసూలు చేస్తున్నట్లు చెబుతున్నారు. అధికార పార్టీ నాయకుల అండ దండలతో బెల్టు షాపులు నడుస్తుండటంతో ఆ షాపులపై అధికారులు కన్నెత్తి చూసే సాహసం చేయలేకపోతున్నారనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఇటీవల కొన్ని గ్రామాల్లో ఎక్సైజ్, పోలీసులు దాడులు చేసి బెల్టు షాపు నిర్వాహకులను అదుపులోకి తీసుకుని, కేసులు పెట్టినా మరుసాటి రోజుకే మళ్లీ బెల్టు దుకాణం ఓపెన్ చేస్తున్నారు.

చిత్తవుతున్న యువత

గ్రామాల్లో బెల్టు జోరుగా సాగుతుండటంతో యువత మద్యానికి బానిసలుగా మారుతున్నారని, పచ్చని కుటుంబాలు మద్యం మత్తులో పడి చితైపోతున్నాయనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. గ్రామాల్లో మద్యం షాపులు మందు బాబులకు అడ్డాగా మారుతుండటంతో మహిళలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. షాపు వద్దనే మద్యం తాగేసి సీసాలు ఇళ్ల పరిసర ప్రాంతాల్లోనే పడేస్తున్నారు. మందు బాబుల అరుపులు, కేకలతో విసిగెత్తి పోతున్నామని పలువురు మహిళలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

బెల్టుషాపులపై చర్యలు తీసుకోవాలి



గ్రామాల్లో బెల్టుషాపులు నిర్వహించడంతో యువత మద్యానికి బానిసై తప్పుదారి పట్టే ప్రమాదం ఉంది. గ్రామాల్లో విచ్చలవిడిగా బెల్టుషాపులు నిర్వహిస్తున్నారు. బెల్టుషాపుల తొలగించేందుకు ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలి. గ్రామాల్లో మద్యం అమ్మకాలను అరికట్టడంపై ఎక్సైజ్ శాఖ, పోలీసులు ప్రత్యేక నిఘా పెట్టాలి. - వంపన్నగౌడ్, ఏపీ రైతు సంఘం జిల్లా కార్యదర్శి

బెల్టులను అరికట్టాలి



గ్రామాల్లో అధికారులు తప్పనిసరిగా బెల్టు షాపులను నియంత్రించాలి. పచ్చని పల్లెలు మద్యం మత్తులో చిత్తవుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదు. పోలీసులు, ఎక్సైజ్ శాఖ అధికారులు గ్రామాల్లో బెల్టుల షాపులపై నిఘా ఉంచి వాటిని అరికట్టాలి. యువత మద్యం మత్తులో పెడదారి పడుతోంది. మద్యం నియంత్రణతోనే పల్లెలు మెరుగుపడతాయ్. - విరూపాక్షిరెడ్డి, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి

తొందరపడి పత్తిని అమ్ముకోవద్దు



యార్డు సెక్రటరీ గోవిందు

ఆదోని అర్బన్: రైతులు తొందరపడి తక్కువ ధరకు పత్తి దిగుబడులు అమ్ముకోవద్దని, ఈనెల 21వ తేదీ తర్వాత సీసీఐ కొనుగోలు కేంద్రాలు ఏర్పాటయ్యే అవకాశం ఉందని ఆదోని వ్యవసాయ మార్కెట్ యార్డు సెక్రటరీ గోవిందు తెలిపారు. మంగళవారం స్థానిక యార్డు కార్యాలయంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. సీసీఐ కొనుగోలు కేంద్రాలు ఏర్పాటైతే రైతులకు గిట్టుబాటు ధర వస్తుందని, ముందుగానే పత్తిని తక్కువ ధరకు అమ్ముకోవద్దని సూచించారు. రైతులు పత్తిని ఆరబెట్టుకుని అమ్మకానికి సిద్ధంగా ఉంచాలన్నారు. యార్డుకు తెచ్చే పత్తి దిగుబడుల వాహనాలు ఉదయం 10 గంటల్లోపు లోపలికి ఎంట్రీ అయ్యేలా చూసుకోవాలని, వాటికి మాత్రమే రైతులకు ఐడీ రిజిస్ట్రేషన్ అవుతుందన్నారు. యార్డులో వ్యాపారులు మధ్యాహ్నం 3:30 గంటల కల్లా టెండర్ పూర్తి చేసుకోవాలన్నారు. దీంతో రైతులు కాటా వేసుకుని తొందరగా వారి గమ్యస్థానానికి చేరుకుంటారన్నారు.

కనీస మద్దతు ధర అమలు చేయాలి



యార్డు సెక్రటరీ గోవిందుకు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

ఆదోని రూరల్: పత్తి, వేరుశనగ పంటలకు కనీస మద్దతు ధర అమలు చేయాలని ఏపీ రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు కె.వెంకటేశ్వర్లు, జిల్లా ఉపాధ్యక్షుడు కె.మల్లయ్య డిమాండ్ చేశారు. మంగళవారం స్థానిక మార్కెట్‌యార్డులో రైతులతో కలిసి ధర్నా చేపట్టారు. వారు మాట్లాడుతూ గత వారం రోజులుగా వ్యాపారులు సిండికేట్‌గా ఏర్పడి పత్తి, వేరుశనగ పంట ధరలను క్వింటాల్‌కు రూ.500 నుంచి రూ.1000 వరకు తగ్గించేశారన్నారు. అలాగే వేరుశనగ పంట ధర కూడా తగ్గించారని, కనిష్ట ధర రూ.4 వేలు లోపే ఉందన్నారు. పత్తి పంట కనిష్ట ధర కూడా రూ.4 వేలు లోపే ఉందన్నారు. దీంతో కూలీలు, విత్తనాల ఖర్చు కూడా రావడం లేదని, తక్షణమే సీసీఐ, మార్క్‌ఫెడ్, ఆయిల్‌ఫెడ్ తదితర ప్రభుత్వ సంస్థల ద్వారా కనీస మద్దతు ధరలకు పత్తి, వేరుశనగ పంటలను కొనుగోలు చేయాలన్నారు. అనంతరం యార్డు సెక్రటరీ గోవిందుకు వినతి పత్రం అందించారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు కె.లింగన్న, రైతు సంఘం నాయకులు ఈరన్న, వీరేష్, బాషా, హనుమంతు తదితరులు పాల్గొన్నారు.

బంకులు తొలగించండి

ఎమ్మిగనూరుటౌన్: పట్టణంలోని వైడబ్ల్యూసీఎస్ మైదానంలో ఏర్పాటు చేసిన బంకులను తొలగించాలని పీడీఎస్‌యూ జిల్లా ప్రధాన కార్యదర్శి మహేంద్రబాబు డిమాండ్ చేశారు. మంగళవారం స్థానికంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. బంకులను తొలగిస్తామని ఎన్నికల ముందు హామీ ఇచ్చిన ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వర్ రెడ్డి అధికారంలోకి వచ్చిన తరువాత వాటి గురించి పట్టించుకోవడం లేదని అన్నారు. క్రీడామైదానంగా ఉపయోగించే మైదానంలో ఏర్పాటు చేసిన బంకులను తొలగించడంలో ఎందుకింత జాప్యం చేస్తున్నారని ప్రశ్నించారు. ఇప్పటికైనా వాటిని తొలగించేందుకు ఎమ్మెల్యే, మున్సిపల్ అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు.

నల్ల బ్యాడ్జీలతో వైద్య సిబ్బంది నిరసన



నల్లబ్యాడ్జీలు ధరంచి నిరసన తెలియజేస్తున్న వైద్య సిబ్బంది

గోనెగండ్ల : రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న వైద్య సిబ్బంది సమస్యలను పరిష్కరించాలని, లేకుంటే ఉద్యమం తీవ్రతరం చేస్తామని డాక్టర్ హరిష్ కుమార్, సీహెచ్ఓ మేరిగోల్డ్, ఎంపీహెచ్ఈఓలు హనుమంతు, సుధాకర్ హెచ్చరించారు. వైద్యులకు మద్దతుగా మంగళవారం మధ్యాహ్న భోజన విరామ సమయంలో గోనెగండ్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్య సిబ్బంది నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన తెలియజేశారు. వారు మాట్లాడుతూ తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ వైద్యులు సమ్మె చేస్తున్నా ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తోందన్నారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో పనిచేసే వైద్యుల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు.

ప్రతి ఒక్కరికి జీవితబీమా అవసరం



మాట్లాడుతున్న ఎల్ఐసీ కడప డివిజన్ సీనియర్ మేనేజర్ రవికుమార్

ఎమ్మిగనూరుటౌన్: ప్రతి ఒక్కరికీ జీవిత బీమా అవసరమని ఎల్ఐసీ కడప డివిజన్ సీనియర్ మేనేజర్ రవికుమార్ అన్నారు. మంగళవారం స్థానిక ఎల్ఐసీ కార్యాలయంలో బ్రాంచ్ మేనేజర్ పులినాయక్ అధ్యక్షతన ఏజెంట్ల విస్తృత స్థాయి సమావేశం నిర్వహించారు. ఇందులో భాగంగా పట్టణంలో ఎల్ఐసీ బ్రాంచ్ ఏర్పాటు చేసి 25 సంవత్సరాలు పూర్తయి నందున అత్యధికంగా పాలసీలు చేసిన ఏజెంట్ల పేర్లతో ఏర్పాటు చేసిన శిలాఫలకాన్ని ప్రారంభించారు. అలాగే రూ.80లక్షల సింగిల్ పాలసీని తెచ్చిన ఏజెంట్ ప్రసాద్‌స్వామిని సత్కరించారు. కార్యక్రమంలో అసిస్టెంట్ బ్రాంచ్ మేనేజర్ సంతోషకుమార్, పత్తికొండ శాటిలైట్ బ్రాంచ్ మేనేజర్ మధుసూదన్, కడప ఎల్ఐసీ డీఓ అసోసియేషన్ అధ్యక్షుడు తిమ్మారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నిలిచిన 104 సేవలు



నందవరం పీహెచ్‌సీలో నిలిచిన 104 వాహనం

నందవరం : రాష్ట్ర ప్రభుత్వం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యుల సమస్యలు పరిష్కరించకపోవడంతో డాక్టర్లు సమ్మెబాట పట్టారు. దీంతో పీహెచ్‌సీలో వైద్య సేవలతో పాటు 104 సేవలు నిలిచి పోయాయి. ఇంటింటికి మెరుగైన వైద్యాన్ని కూటమి ప్రభుత్వం అటకెక్కించింది. గ్రామాల్లో మెరుగైన వైద్య సేవలు ఆగిపోయాయి. పల్లె రోగులకు కష్టాలు చెరువయ్యాయి. పీహెచ్‌సీలో అత్యవసర వైద్య సేవలు మాత్రమే అందిస్తున్నారు. అలాగే స్టాఫ్ నర్సులు, ఎంఎల్‌హెచ్‌పీతో వైద్య సేవలు అందిస్తున్నారు. ప్రభుత్వం స్పందించి డాక్టర్ల సమస్యలు పరిష్కారించి మెరుగైన వైద్య సేవలు అందించాలని ప్రజలు కోరుతున్నారు.

ఇసుక ట్రాక్టర్ల సీజ్



పోలీసులు సీజ్ చేసిన ఇసుక ట్రాక్టర్

నందవరం : ఇసుకను అక్రమంగా తరలిస్తే కఠిన చర్యలు తప్పవని ఎస్ఐ కేశవ హెచ్చరించారు. మంగళవారం నాగలదిన్నెలో పోలీసులు దాడులు నిర్వహించి మూడు ట్రాక్టర్లను సీజ్ చేసి పోలీస్ స్టేషన్‌కు తరలించారు. అనంతరం తహసీల్దార్‌కు రేఫర్ చేయగా ఆర్ఎస్‌డీటీ మహేష్ ట్రాక్టర్‌కు రూ.2 వేలు చొప్పున జరిమానా విధించారు. వారు మాట్లాడుతూ..అనుమతులు లేకుండా ఇసుకను తరలిస్తే ట్రాక్టర్లను సీజ్ చేసి ఓనర్, డ్రైవర్లపై కేసు నమోదు చేస్తామన్నారు. పోలీసులు సూభాన్, భాస్కర్ తదితరులు ఉన్నారు.

ఉరుకుందలో వేలం పాటలు

కౌతాళం: జిల్లాలో ప్రసిద్ధి చెందిన ఉరుకుంద ఈరన్నస్వామి ఆలయంలో వివిధ పనులకు మంగళవారం టెండర్లు నిర్వహించారు. ఆలయ డిప్యూటీ కమిషనర్ వాణి, దేవదాయ శాఖ ఇన్స్‌పెక్టర్ వెంకటేశ్వర్లుల ఆధ్వర్యంలో వేలం పాటను నిర్వహించారు. స్వామి వారికి భక్తులు సమర్పించిన అల్యూమినియం, గుడ్రాలు, కోర మీసాలు, కనుగుడ్లు, పాత ఇనుప సామాన్లు, నెయ్యి నూనె ఖాళి డబ్బులు, ఖాళీ పెరుగు బకెట్లు, ప్లాస్టిక్ వస్తువులకు బహిరంగ వేలం పాటలు నిర్వహించారు. ఔట్‌సోర్సింగ్‌కు షీల్డ్, ఆన్‌లైన్ టెండర్లు ఆహ్వానించగా ముగ్గురు షీల్డ్ టెండర్లు వెయ్యగా, నల్గురు ఆన్‌లైన్ ద్వారా టెండర్లు వేశారు. ఇందులో ఇద్దరు పాటదారులు ఒకటే రేటుకు వేయడంతో రద్దు చేసినట్లు డిప్యూటీ కమిషనర్ వాణి తెలిపారు. ఐమాక్స్ విద్యుత్ దీపాలకు ఒకే టెండర్ రావడంతో అది కూడ రద్దు చేశారు. కార్యక్రమంలో ఆలయ పర్యవేక్షకులు మల్లికార్జున, వెంకటేష్, సీనియర్ అసిస్టెంట్‌లు కిరణ్, కుమార్, ఆలయ ఇన్స్‌పెక్టర్ వీరేష్, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

రక్షణలేని ట్రాన్స్‌ఫార్మర్



శాంతిఎస్టేట్‌లోని ట్రాన్స్‌ఫార్మర్

ఆదోని సెంట్రల్: మండలంలోని మండిగిరి గ్రామ పంచాయతీ పరిధిలోని శాంతి ఎస్టేట్‌లోని ట్రాన్స్‌ఫార్మర్‌కు కంచె ఏర్పాటు చేయకపోవడంతో ప్రమాదకరంగా మారింది. నాలుగు రోడ్ల కూడలిలో ఏర్పాటు చేసిన ఈ ట్రాన్స్‌ఫార్మర్ కొంత కాలంగా రక్షణ లేకుండా ఉండడంతో స్థానికులు ఆందోళనకు గురవుతున్నారు. కాలనీ రోజు రోజుకు విస్తరిస్తుండటంతో జనాభా పెరిగింది. వాహనదారులు, పాదాచారులు శాంతి ఎస్టేట్ నుంచి శ్రీదేవి ఎస్టేట్, తిరుమల నగర్ వైపు నిత్యం రాకపోకలు సాగిస్తున్నారు. దీనికితోడు చిన్న పిల్లలు, వృద్ధులు ఈ రహదారి గుండా వెళ్తుంటారు. ఎప్పుడు ఎలాంటి ప్రమాదం ముంచుకొస్తుందోని కాలనీ వాసులుభయాందోళనకు గురవుతున్నారు. అధికారులు స్పందించి ట్రాన్స్‌ఫార్మర్‌కు కంచేను ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.

జీవన నైపుణ్యాలను మెరుగుపరుచుకోవాలి

ఆదోని సెంట్రల్: పోటీ ప్రపంచంతో ఒత్తిడికి గురికాకుండా జీవిన నైపుణ్యాలను మెరుగుపరుచుకోవాలని కిడ్డీస్ రూట్స్ స్కూల్, కళాశాల అధినేత కేశవ నారాయణ రెడ్డి అన్నారు. మంగళవారం విద్యార్థులకు స్టాఫ్ స్కిల్ ట్రైనింగ్, మోటివేషన్ తరగతులను నిర్వహించారు. మాస్టర్ మోటివేటర్ గౌతమి విద్యార్థుల ఉత్తమ భవిష్యత్తుకై పలు అంశాలను విశ్లేషించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ అయ్యప్ప అధ్యాపకులు పాల్గొన్నారు.

అసిస్టెంట్ ఇంజినీర్‌పై చర్యలు తీసుకోవాలి



మధ్యలో పనులు నిలిచిన స్కూల్ గదిని చూపుతున్న గ్రామస్తులు

ఎమ్మిగనూరురూరల్: మండల పరిధిలోని గార్లదిన్నె గ్రామంలోని పాఠశాలలో నాడు-నేడు కింద చేపట్టిన పనుల్లో అవకతవకలు పాల్పడిన అసిస్టెంట్ ఇంజినీర్ లక్ష్మన్నపై చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు ఏలిషు, తిమ్మగురుడు, చిన్న రాముడు, సురేష్, అనంద్ ఆరోపించారు. మంగళవారం వారు మాట్లాడుతూ గ్రామంలో నాడు- నేడు కింద పాఠశాల గదులు నిర్మాణం చేయగా మధ్యలోనే నిలిచిపోయాయని చెప్పారు. శాశ్వత హెచ్ఎం లేకపోవడంతో అసిస్టెంట్ ఇంజినీర్ నిధులు స్వాహా చేశారని ఆరోపించారు. గదులకు టైల్స్, డోర్లు వేయకుండా బిల్లులు చేసుకున్నట్లు తెలిపారు. పాఠశాలకు డోనెట్ చేసిన ఫ్యాన్స్, కుర్చీలను కూడా మాయం చేసినట్లు ఆరోపించారు. ఇదే విషయంపై ఆయన్ను గ్రామస్తులందరూ నిలదీయగా డబ్బులు అకౌంట్‌లో ఉన్నాయని చెబుతున్నారని, కానీ చూపించటం లేదన్నారు. ఇప్పుడు ఆయన కులమాలకు బదిలీపై వెళ్లారని, కొత్తగా వచ్చిన అసిస్టెంట్ ఇంజినీర్‌ను నిధులపై ఆరా తీయగా నాకు సంబంధం లేదని చెబుతున్నారన్నారు. అధికారులు స్పందించి బదిలీపై వెళ్లిన అధికారిపై విచారణ జరిపించి చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

జీఎస్టీ తగ్గింపుపై అవగాహన



మంత్రాలయంలో ఎంపీడీఓ కార్యాలయంలో జీఎస్టీ తగ్గింపు పోస్టర్లను విడుదల చేస్తున్న అధికారులు

మంత్రాలయం రూరల్ : జీఎస్టీ తగ్గింపు ప్రతి ఒక్కరూ అవగాహన పెంచుకోవాలని ఎంపీడీఓ నూర్జహాన్ సూచించారు. మంగళవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో జీఎస్టీ తగ్గింపు, ప్రధాన మంత్రి పర్యటన ఏర్పాట్లపై నియోజకవర్గ స్థాయి అధికారులు, మండల అధికారులు, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది, డీఆర్‌డీఏ సిబ్బంది, డ్వామా సిబ్బంది, రెవెన్యూ సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ.. గతంలో జీఎస్టీ నాలుగు స్లాబ్స్‌గా ఉండేదని, ప్రస్తుతం కేంద్ర ప్రభుత్వం రెండు స్లాబ్స్‌కు కుదించిందని వివరించారు. అలాగే ఈ నెల 16వ తేదీన దేశ ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ కర్నూలు పర్యటనకు విచ్చేస్తున్నారని, అందరూ కలిసి కట్టుగా పర్యాటన విజయవంతం చేసేందుకు కృషి చేద్దామని పిలుపునిచ్చారు. నియోజకవర్గానికి 101 బస్సులు కేటాయించారని, అందులో మంత్రాలయానికి 17 బస్సులు, పెద్దకడబూరుకి 24, కోసిగి 25, కౌతాళం 35 బస్సుల చొప్పున కేటాయించారని తెలిపారు. ప్రతి ఒక్కరూ తమకు కేటాయించిన విధులను సక్రమంగా నిర్వహించి పర్యటన జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీడీఓ ప్రభావతి, ఈఓపీఆర్డీ ఉపేంద్రరెడ్డి, వెలుగు ఏపీఎంలు రాజశేఖర్, శ్రీనివాసులు, ఏపీఓలు భక్తవత్సలం, చంద్రశేఖర్, అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు సుమిత్రమ్మ, తదితరులు పాల్గొన్నారు.

కోసిగి: రైతులకు వ్యవసాయ పరికరాలు, పనిముట్లపై జీఎస్టీ తగ్గించిందని, కొన్నింటిపై తొలగించిందని ఎంపీడీఓ ఈశ్వరయ్య తెలిపారు. మంగళవారం కోసిగిలో రైతులు, ఇంటి నిర్మాణాలు చేపట్టే లబ్ధిదారులకు హౌసింగ్ ఏఈతో కలిసి జీఎస్టీ తగ్గింపుపై అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ఆహర పదార్థాల నుంచి వ్యవసాయం, గృహానిర్మాణాలు పరికరాలు తదితర అన్ని రకాలపై జీఎస్టీని తగ్గించిందన్నారు.

'మోదీ గో బ్యాక్ '

ఆదోని టౌన్/ సెంట్రల్: ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేక హోదా ఇవ్వని నరేంద్ర మోదీ గో బ్యాక్ అంటూ ఆదోని కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు సాయినాథ్ అన్నారు. మంగళవారం ఆయన స్థానిక పార్టీ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఈనెల 16న ప్రధాని మోదీ కర్నూలు పర్యటనను కాంగ్రెస్ పార్టీ వ్యతిరేస్తుందన్నారు. నాడు ప్రత్యేక హోదా, విభజన హామీలు నెరవేరుస్తానని చెప్పిన ప్రధాని మోదీ నేటికీ అమలు చేయకపోవడం ఏమిటని ప్రశ్నించారు. 11 సంవత్సరాలుగా జీఎస్టీ అధిక పన్నులు వసూలు చేసి ఇప్పుడు జీఎస్టీ తగ్గించామని సంబరాలు చేసుకుంటున్నారన్నారని, ప్రజలు గమనిస్తున్నారన్నారు. జీఎస్టీ తెచ్చి మీరే నిత్యావసర సరుకులు పెంచి, ఇప్పుడేదో దేశ ప్రజలకు మేలు చేసినట్లు గొప్పలు చెప్పుకోవడం సిగ్గుచేటన్నారు. కార్యక్రమంలో మాజీ డీసీసీ ఉపాధ్యక్షులు, కౌన్సిలర్ దిలీప్‌డోకా, యువజన కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మారుతిరావు, యువజన కాంగ్రెస్ పార్టీ పట్టణాధ్యక్షుడు దేవిశెట్టి వీరేష్ పాల్గొన్నారు.



కుళాయి వద్ద గుమిగూడిన ప్రజలు

ఏనుగుబాలలో తాగునీటి ఎద్దడి



కుళాయికి బోరు పంపు, మోటార్ అమర్చి నీటిని పట్టుకుంటున్న దృశ్యం

ఎమ్మిగనూరురూరల్: మండల పరిధిలోని ఏనుగుబాల గ్రామంలో ప్రజలు తాగునీటి కష్టాలను ఎదుర్కొంటున్నారు. గ్రామంలో మూడు ట్యాంక్‌లు ఉన్నా నీరుపయోగంగా ఉన్నాయి. గోనెగండ్ల మండలం అల్వాల గ్రామం ఎస్ఎస్ ట్యాంక్ నుంచి గ్రామానికి నీరు సరఫరా చేస్తున్నారు. రోజు మరచి రోజు నీటి సరఫరా జరుగుతుండటంతో.. అరకొరగా వస్తున్న నీరు ప్రజలకు ఏమాత్రం సరిపోవడంలేదు. గ్రామంలోని మారెమ్మ గుడి, జమ్మన్న సేను, చాకలి వీదు, గోవిందమ్మ గుడి వీధుల్లో నీటి సమస్య తీవ్రంగా ఉంది. కుళాయిలకు నీరందకపోవడంతో నీరు వదిలిన సమయంలో గ్రామస్తులు కుళాయికి మోటారు, బోరు పంపు పెట్టి నీటిని పట్టుకోవాల్సి వస్తోంది. ఏ నాయకుడు వచ్చినా మా గ్రామానికి తాగునీటి సమస్యను తీర్చలేకపోతున్నారని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైన అధికారులు స్పందించి గ్రామంలో తాగునీటి సమస్యను పరిష్కరించాలని కోరుతున్నారు.